క్లుప్తంగా

కానూరులో మేరీమాత జపమాల



పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో బుధవారం రాత్రి జపమాల స్తోత్రాలతో ప్రారంభమయ్యాయి. గుణదల మేరీమాత శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జపమాలను ప్రారంభించి గురువారం ఉదయం వరకు నిర్వహించామన్నారు. భక్తులకు దివ్యబలి పూజాప్రసాదం పంపిణీ చేశామని తెలిపారు. జపమాల కార్యక్రమానికి ఉపదేశకులు, యూనిట్ సభ్యులు, ప్యారిష్ కౌన్సిల్ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

మేరీమట్టి మేరీదేశ్ కలశయాత్ర



విజయవాడరూరల్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ బ్లాక్ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో మేరీ మట్టి మేరీదేశ్ కలశయాత్ర నిర్వహించారు. డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ ఇండియా వన్ నేషన్ ఇంపార్టెన్స్‌ను కలశయాత్రను గురించి వివరించారు. కార్యక్రమంలో కాలేజి సెక్రటరీ లక్ష్మణస్వామి, డాక్టర్ ఏ పతాంజలి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, విజయవాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ప్రతినిధి విజయబాబు, ఎస్ఆర్‌కె కాలేజి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.చిన్న, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ స్టాఫ్ డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌తో సహా ఇద్దరిపై కేసు

పెనమలూరు: కానూరులో భూమికి సంబంధించి వాచ్‌మెన్‌ను బెదిరించిన సంఘటనలో రౌడీషీటర్‌తో సహా ఇద్దరు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరులో ట్రస్టు భూములపై గత కొద్ది కాలంగా వివాదం ఉంది. అయితే భూముల వద్ద ఉంటున్న వాచ్‌మెన్ దూదేకుల శ్రీనును కానూరుకు చెందిన రౌడీషీటర్ కొక్కిరిగడ్డ జాన్‌బాబు, దయాసాగర్, వీరబాబులు బుధవారం బెదిరించారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పెదపులిపాకలో వ్యక్తి అదృశ్యం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వ్యక్తి అదృశ్యం అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శ్రీనగర్‌కాలనీకి చెందిన రెడ్డి వేణుగోపాల్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. లారీ కిరాయి కావాలని అతను ఈ నెల 16న తెనాలి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో 17న భార్య లక్ష్మీదేవి ఫోన్ చేయగా భర్త ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరులో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యం కావటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం షేక్.పూల్‌సైదా కుటుంబ సభ్యులతో కానూరులో ఉంటున్నాడు. పీవీపీ సిద్ధార్థలో ఇంజినీరింగ్ కాలేజీలో కుమార్తె(19) బీటెక్ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 16న ఆమె కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం గాలించిన ఆచూకీ లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వైభవంగా అమ్మవారికి సారె సమర్పణ



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువారం అమ్మవార్లకు సారె సమర్పించే గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్థానిక మద్దిరావమ్మ ఆలయం నుంచి సూరంపల్లి – ఆగిరిపల్లి అడ్డరోడ్డు వద్ద నున్న కనకదుర్గమ్మ దేవాలయం వరకూ, అక్కడి నుంచి శివాలయం వరకూ సారెలతో తరలివెళ్ళారు. తిరుమల తిరుపతి దేవస్థానం నాదస్వరం విద్వాంసులు కందిమళ్ళ యగ్నేష్ వర్మ, వినయ్‌కుమార్, డోలు కళాకారులు సారె సమర్పణలో పాల్గొన్నారు.

శ్రీమహాచండీదేవిగా అమ్మవారు



శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీమహాచండీదేవి అలంకరణ



శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా పేరంటాలమ్మ



యనమలకుదురులో స్కందమాతదేవిగా అమ్మవారు



కంకిపాడు శివాలయంలో మహాచండీ అలంకరణ



గోసాలలో శ్రీబాలాత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు

కొనసాగుతున్న దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు

గన్నవరం: దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు గన్నవరం ప్రాంతంలో ఘనంగా జరుగుతున్నాయి. శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులచే పూజలందుకున్నారు. తొలుత శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ గాయత్రిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగాయత్రి మందిరంలో శ్రీమహాచండీదేవికి పూజలు చేయడంతో పాటు చండీహోమం నిర్వహించారు. శ్రీభువనేశ్వరీ పీఠం, యాదవ రామాలయం, దావాజిగూడెం, కేసరపల్లి, అల్లాపురం, బుద్ధవరం గ్రామాల్లో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

రామవరప్పాడులో...

రామవరప్పాడు : శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ హనిష చౌదరి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

శ్రీబాలాత్రిపురసుందరి దేవి

పెనమలూరు: మండలం పరిధిలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రిలు సందర్భంగా గురువారం అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. గోసాల శ్రీకనకదుర్గమ్మ ఆలయం, యనమలకుదురు శ్రీకనకదుర్గమ్మ ఆలయం, పోరంకి శ్రీనివాసనగర్ షిర్డీసాయిబాబా మందిరం, పెదపులపాక శ్రీ విజయరాజరాజేశ్వరి ఆలయాల్లో అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ స్కందమాతదేవిగా అలంకరణ చేశారు. చండీహోమం, సామూహిక కుంకుమ పూజలు చేశారు. నేడు ఆలయాల్లో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిస్తారు.

కంకిపాడులో...

కంకిపాడు: దేవీశరన్నవరాత్రుల్లో ఐదో రోజైన గురువారం అమ్మవారు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు శివాలయంలో లలితాత్రిపుర సుందరీదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి పూజలందుకున్నారు. ఈడుపుగల్లు, కంకిపాడు శివాలయాల్లో మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీకన్యకా పరమేశ్వరీ అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో పూజలందుకున్నారు.

విజయవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఐదోరోజు నున్న గ్రామంలోని షిర్డి సాయిబాబా మందిరంలో కనకదుర్గమ్మ అమ్మవారు చండీదేవిగా భక్తులకు దర్శనమివ్వగా పూజలు చేశారు. శ్రీచక్రానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళాభక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. చెరువు సెంటర్లోని దుర్గాదేవి అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు. హోమాలు, మూల మంత్ర హోమము నివేదన, హారతి మంత్ర పుష్పం తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది. చినకంచిలో శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానంలో కామాక్షి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా పూజించారు.



నున్న శ్రీషిర్డిసాయి బాబా మందిరంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



ఉయ్యూరులో శ్రీమహాచండీదేవి అమ్మవారు

ఉయ్యూరులో...

ఉయ్యూరు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉయ్యూరు ఏజీకె నగర్‌లోని శ్రీ విజయదుర్గాభవాని దేవి ఆలయంలో మహాచండీ దేవి అలంకారంలో అమ్మవారు పూజలందుకున్నారు. ఉయ్యూరు శివాలయం, పెద ఓగిరాల శివాలయం, ముదునూరు శివాలయంలో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గండిగుంట దత్త దేవాలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

సురక్షిత తాగునీటితో ఆరోగ్యం



కంకిపాడు: సురక్షిత తాగునీటి సరఫరాతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో జల్ జీవన్‌మిషన్ నిధులు రూ 30లక్షలు అంచనా వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ విస్తరణ పనులను గురువారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి వసతులను మెరుగుపర్చాలని చెప్పారు. సురక్షిత తాగునీటి ద్వారానే ప్రజల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు, ఈడ్ల కూర్మారావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జగన్మాతకు నృత్యాభిషేకం

విజయవాడ కల్చరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో ప్రదర్శిస్తున్న నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఉభయతెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు జగన్మాతకు నృత్యాభిషేకం చేశారు. ఒంగోలు నుంచి వచ్చిన ఆధ్యాత్మికవేత్త పొన్నూరు వెంకటశ్రీనివాసులు దైవీ వైభవంపై ప్రసంగించారు. చల్లపల్లి నుంచి వచ్చిన సామ్రాజ్యం దేవీ భక్తి గీతాలను, ఎం.అన్నపూర్ణ బృందం, ఎస్.దుర్గేష్ నందిని, పామర్రుకు చెందిన ఫణికుమార్ ఫ్లూట్‌పై త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. నాట్యాచార్యులు చదలవాడ ఆనంద్, త్రినాథాచారి బృందం సంప్రదాయ కీర్తనలను నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారి పోతరాజు రోషిత నవదుర్గ వైభవం అంశాన్ని ప్రదర్శించి ఆకట్టుకుంది.

సురక్షతో ప్రజారోగ్య పరిరక్షణ



కంకిపాడు సురక్ష శిబిరంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు



వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న కమిషనర్ ప్రకాశరావు.



కొండపావులూరులో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ రవి, ఏఎంసీ చైర్మన్ తదితరులు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. పోరంకి సాలిపేటలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అలాగే తాడిగడప మున్సిపాలిటీలోని 19వ వార్డు సచివాలయాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ రవికుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, తెన్నేటి ప్రకాష్, జీవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా

ఉంగుటూరు: పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకే జగనన్న ఆరోగ్య సురక్షను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. పొట్టిపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను స్థానికంగానే స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ వనజాక్షి, ఎంపీడీవో, గ్రామ సర్పంచులు కత్తుల జ్యోతి, ఎస్.నాగరాజు చేతుల మీదుగా మందుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్‌కె కరిముల్లా, మోహన్‌రావు, అఖిల్‌తేజ, మల్లిఖార్జునరావు, ఈవోపీఆర్డీ బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కంకిపాడులో...

కంకిపాడు: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు గొప్ప వరమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో జగనన్న సురక్ష గురువారం నిర్వహించారు. డాక్టర్ సుందర్‌కుమార్ ప్రతినిధుల బృందం రోగులకు వైద్య సేవలు అందించింది. శిబిరంలో 605 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండపావులూరులో...

గన్నవరం రూరల్: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత ప్రభుత్వ వైద్యం లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. కొండపావులూరు ఆర్సీఎం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారితో కలసి ప్రారంభించారు. శిబిరంలో 603 మందికి వైద్యులు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, సహకార బ్యాంకు అధ్యక్షుడు కంచర్ల నాగబాబు, ఉపసర్పంచ్ దొండపాటి నిర్మల, ఎంపీడీవో సత్యకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

711 మందికి వైద్య పరీక్షలు...



మడిచర్ల జగనన్న సురక్షక్యాంపులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మడిచర్లలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ అజ్మీరా శాంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు చెరుకూరి శ్రీనివాస్ ప్రారంభించారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎంజే మంజూషా నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు అవలంభించాల్సిన ఆహార పద్ధతులు, సమతుల్య పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో 711 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు భూక్యా దేవి, ఉపసర్పంచ్ సుబ్రహ్మణేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

రూ 1.30 కోట్లతో గ్రామ సచివాలయం భవనాలు





పెనమలూరులో నిర్మించిన సచివాలయ భవనాలు

- సచివాలయం భవనాల నిర్మాణం పూర్తి.
- త్వరలో ప్రజలకు సేవలు.

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరులో మూడు సచివాలయం భవనాలను నిర్మాణం చేశారు. వీటిని త్వరలో ప్రారంభించనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెనమలూరు గ్రామానికి జనాభా ప్రాతిపదికన మూడు గ్రామ సచివాలయాలను మంజూరు చేసింది. భవనాలు నిర్మాణం చేసే వరకు సచివాలయం కార్యాలయాలను వెలుగు శాఖకు చెందిన స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేశారు. అయితే సచివాలయాల భవనాలను నిర్మాణం చేయటానికి తొలుత సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇంతకాలం నిర్మాణం జరగలేదు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో ఎట్టకేలకు సచివాలయం భవనాలు నిర్మాణం చేయటానికి స్థలం కేటాయించారు.

రూ 1.30కోట్లు మంజూరు..

మూడు గ్రామ సచివాలయం భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ 1.30కోట్లు నిధులను మంజూరు చేసింది. దీంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద 1, 3వ గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణం చేశారు. 2వ సచివాలయ భవనం దేవన్నచెరువు వైఎస్సార్ కాలనీ సమీపంలో నిర్మాణం చేశారు. వచ్చే నెలలో సచివాలయం భవనాలు ప్రారంభించాలని అధికారులు యత్నిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో...



గతంలో సచివాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రజలకు పాలన చేరువ చేయటానికి ప్రభుత్వం మూడు సచివాలయం భవనాలు నిర్మాణం చేసింది. త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాము.

– లింగాల భాస్కరరావు, సర్పంచి, పెనమలూరు గ్రామం.

విద్యార్థులు నిరంతరం పుస్తకాలు చదవాలి

గన్నవరం రూరల్: విద్యార్థులు నిరంతరం పుస్తకాలు చదవాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. దసరా సెలవులు సందర్భంగా స్థానిక విద్యార్థులచే గురువారం గ్రంథాలయంలో కథలు, దేశ భక్తుల చరిత్ర పుస్తకాలను విద్యార్థులచే చదివించారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవానీ భక్తులకు అన్నదానం అభినందనీయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: భవానీ భక్తులకు గత 14ఏళ్లుగా అన్నదానం చేస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్ సేవాగుణం అభినందనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యాపు మధుసూధనరెడ్డి అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బెజవాడ దుర్గగుడికి కాలినడకన వెళ్తున్న భవానీ భక్తులకు బాపులపాడు మండలం బొమ్ములూరులో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూధనరెడి గురువారం సందర్శించారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లతో పాటుగా వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి, వైద్య సదుపాయాలను కల్పించటం అభినందనీయమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ ఆయనతో పాటు ఉన్నారు.